క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్/కడప వైఎస్ఆర్ సర్కిల్: పంచాయతీ కార్మికులకు నష్టం కలిగించే ఆన్‌లైన్ టెండర్ల విధానానికి స్వస్తి పలికి ప్రస్తుతం కొనసాగుతున్న పద్ధతినే అమలు చేయాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో అధికారి ప్రభాకర్ రెడ్డికి ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మెజారిటీ పంచాయతీలలో కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించకపోగా మరికొన్ని పంచాయతీలలో కార్మికుల వేతనాలు నుంచి కటింగ్ చేసిన పీఎఫ్, ఈఎస్ఐ, ఎల్ఐసి డబ్బులు సైతం కార్మికుల ఖాతాలో జమ చేయకుండా తీవ్రమైన నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని తెలిపారు. అలాంటి వారి పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి. మస్తాన్, తిరుపాల్ ప్రకాష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టాల్ పరిశీలన


ప్రొడక్టు గురించి ఎమ్మెల్యే మాధవీరెడ్డికి వివరిస్తున్న కంపెనీ ప్రతినిధి

కడప అగ్రికల్చర్: కడప ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో మంగళవారం కేవీకే ఆధ్వర్యంలో జరిగిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ 17 విడత నిధుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా కోరమాండల్ కంపెనీ ఎగ్జిబిట్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంపెనీ ఉత్పత్తి చేస్తున్న ప్రొడక్టులను ప్రదర్శనలో ఉంచారు. సంబంధిత స్టాల్‌ను కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు తమ ప్రొడక్టుల గురించి, వారు రైతులకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ రమణారెడ్డి, సీనియర్ అగ్రోనోమిష్టు నరిసిరెడ్డి, మార్కెటింగ్ ఆఫీసర్ శివారెడ్డి పాల్గొన్నారు.

అధిక ఫీజుల వసూలుపై చర్యలు తీసుకోవాలి


డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో అధిక ఫీజులను వసూలు చేస్తున్న కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజులు డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ మర్రెడ్డి అనురాధను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కడపతోపాటు పొద్దుటూరు, మైదుకూరు, బద్వేల్, జమ్మలమడుగు, పోరుమామిళ్ల వంటి ప్రాంతా ల్లో కూడా అధిక ఫీజులను వసూలు చేస్తున్నారన్నారు.

కోవెల వద్ద నిలిచిన నీరు



కడప కల్చరల్ : దేవునికడప శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద దాదాపు 50 మీటర్ల పొడవునా రోడ్డుపై వర్షపు నీరు నిలిచింది. సోమవారం నుంచి మూడురోజుల పాటు ఆలయంలో సహస్రకళశాభిషేకం నిర్వహించనున్నారు. దీనికోసం అర్చకులు, నిర్వాహకులు ఎంతో శ్రమతీసుకుంటున్నారు. ఇలాంటిదశలో ఆలయంలోకి వెళ్లే రోడ్డులో గోపురం ముందర పెద్ద ఎత్తున నీరు నిలిచి భక్తులు లోనికి వెళ్లేందుకు ఇబ్బంది కలుగుతోంది. మరోరోజు వర్షం కొనసాగితే నీరు మరింత ఎక్కువగా నిలిచే ప్రమాదం లేకపోలేదు. సంబంధిత అధికారులు వర్షపునీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

ఇసుక కుంభకోణంపై విచారణ జరపాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆదినిమ్మాయిపల్లి వద్ద ఇసుకను కొల్ల గొట్టిన వారిపై విచారణ చేసి కేసులు నమోదు చేయాలని మంగళవారం రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ(ఆర్‌సీపీ) రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కడప ఆర్డీఓ మధుసూదన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు మక్బూల్ బాష, సుబ్బరాయుడు, లక్ష్మిదేవి, ట్రేడ్ యూనియన్ నాయకులు సిద్దరామయ్య, ఖాసీ, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు


దుర్గమ్మ సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేపు వేలం పాట

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక శివాలయం వీధిలోని సుంకు వెంకటసుబ్బయ్య సత్రం కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు సత్రం భూముల బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ రామచంద్రాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. రామేశ్వరం పొలం, మాలెపాడులో ఉన్న 26 సర్వే నంబర్‌లలోని 162.17 ఎకరాల భూములకు సంబంధించి 3 ఏళ్ల కాల పరిమితికి ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.10వేలు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనవచ్చని, వేలం పాట దక్కించుకున్న వారు ఒక సంవత్సరం గుత్తను వెంటనే చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. వివరాల కోసం తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రహదారులపై వర్షపునీటిని తొలగించాలి


గురుకుల్ విద్యాపీఠ్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి రహదారులపై ఉన్న నీటిని తొలగించాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం ఆయన మార్నింగ్ విజిట్‌లో భాగంగా వై జంక్షన్, అప్సర రోడ్, పుష్పగిరి స్కూల్, గురుకుల్ విద్యాపీఠ్ స్కూల్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. అప్సర సమీపంలోని మోర్ మార్కెట్ వద్ద పెద్ద ఎత్తున నీరు నిలవడంపై కమిషనర్ డ్రైన్ లెవెల్స్ పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అప్సర జంక్షన్ వద్ద వినాయకుని గుడి పక్కన డ్రైన్ వెడల్పు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సంజన్న సర్కిల్ నుంచి పుష్పగిరి స్కూల్ మీదుగా నిర్మించిన వరదనీటి కాలువలో నీటి ప్రవాహం పెరిగేలా పైపు కల్వర్టును తొలగించాలన్నారు. ఆ స్థానంలో కల్వర్టు నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి ఏడాది వరద కాలువల్లో పూడిక తీయించాలన్నారు. గురుకుల్ విద్యాపీఠ్ వద్దనున్న ట్రాన్స్‌ఫార్మర్ వెంటనే మార్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఈఈ ధనలక్ష్మి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి


ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం భాకరాపురంలోని జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమస్యలపై ప్రజలనుంచి వచ్చిన వినతిపత్రాలను స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ అభివృద్ధికి కృషి చేయండి


మంత్రి మండిపల్లి రామప్రసాద్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న వీసీ సుధాకర్

వైవీయూ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా ,యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రామప్రసాద్ రెడ్డిని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

రాయచోటిలో యోగివేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ సెంటర్ స్థితిగతులను వివరించారు. ప్రభుత్వ విధానాల ప్రకారం విశ్వవిద్యాలయ ప్రగతికి పూర్తి సహకారం అందిస్తామని మంత్రి స్పష్టం చేశారని వీసీ తెలిపారు. అనంతరం కడప శాసనసభ్యురాలు ఆర్.మాధవీరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, నాయకులు పుత్తా నరసింహారెడ్డిలను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. విశ్వవిద్యాలయ అవసరాలు, జరుగుతున్న అభివృద్ధి గురించి వివరించారు.

వ్యాయామంతో ఆరోగ్యం

సిద్దవటం: క్రమం తప్పకుండా వ్యాయామం, నడక ద్వారా ఆరోగ్యంతో పాటు జీవిత కాలాన్ని ఇంకాస్త పెంచుకోవచ్చని ఇన్‌చార్జి ఎంఈఓ విలియం రాజు తెలిపారు. సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులకు ఫిజియోథెరపీపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఆరోగ్యకరమైన కార్యక్రామలను నిర్వహించడం చాలా సంతోష కరమన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులకు ఫిజియోథెరఫీ అనేది చాలా ముఖ్యమన్నారు. వ్యాయామం చేస్తే ఆరోగ్యంతో పాటు మానసికంగా, శారీరకంగా నూతనోత్సాహంతో ఉంటారని పేర్కొన్నారు.

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని వాహనాలపై చర్యలు


ప్రొద్దుటూరు ఆర్టీఓ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం : ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా తిరిగే ప్రైవేట్ విద్యాసంస్థల వాహనాలపై చర్యలు తీసుకుంటామని ప్రొద్దుటూరు ఆర్టీఓ పి. మురళీధర్ తెలిపారు. మంగళవారం ఆర్టీఓ మీడియాతో మాట్లాడారు. ప్రొద్దుటూరు ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయం పరిధిలో ఇప్పటి వరకు 285 వాహనాలకు ఎఫ్‌సీ చేసినట్లు తెలిపారు. సుమారు 97 శాతం పైగా విద్యాసంస్థల వాహనాలకు సామర్థ్య పరీక్షలను నిర్వహించామన్నారు. మిగిలిన వారు తప్పని సరిగా వారి వాహనాలకు ఎఫ్‌సీ చేయించుకోవాలన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా తిరిగే నాలుగు వాహనాలపై కేసు నమోదు చేసినట్లు ఆర్టీఓ చెప్పారు. ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు తప్పని సరిగా నిబంధనలను పాటించాలన్నారు. 60 ఏళ్లు దాటిన వారిని డ్రైవర్లుగా పెట్టుకోరాదని తెలిపారు. బస్సు వెంట తప్పని సరిగా ఒక అటెండర్ ఉండాలని సూచించారు. డ్రైవరు, క్లీనర్ల పేర్లతో పాటు వారి సెల్ నంబర్లను బస్సులో రాయాలన్నారు. బస్సులపై పాఠశాల, కళాశాలల పేర్లను తప్పక రాయాలని తెలిపారు. పరిమితికి మించి విద్యార్థులు ప్రయాణించకుండా ఆయా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల డ్రైవర్లు హెవీ లైసెన్సులను కలిగి ఉండాలని చెప్పారు. విద్యా సంస్థల బస్సులను ప్రతి రోజూ తనిఖీ చేస్తున్నట్లు ఆర్టీఓ తెలిపారు.

విశ్వకర్మ యోజనపై అవగాహన


లబ్ధిదారు నుంచి దరఖాస్తు తీసుకుంటున్న అధికారులు

పోరుమామిళ్ల : పేదవానికి బంగారు భవిష్యత్తు అందించేందుకు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ఉపయోగపడుతుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాజంపేట రీజనల్ మేనేజర్ మురళీనాయక్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్‌బీఐ రంగసముద్రం శాఖలో విశ్వకర్మ యోజన పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి, ఖాతాదారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆర్ఎం మురళీనాయక్ మాట్లాడుతూ ఉపాధి లేని వృత్తి పనివాళ్లలకు విశ్వకర్మ యోజన ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు ప్రధానమంత్రి ఈ పథకం తీసుకవచ్చారన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి రుణాలు మంజూరు చేసి వారి అభివృద్ధికి సహకరిస్తామన్నారు. రుణాలు తీసుకున్నవారు సకాలంలో తిరిగి చెల్లిస్తే వారికి మరిన్ని రుణాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజంపేట చీఫ్ మేనేజర్ జాఫర్ మొహిద్దీన్, రంగసముద్రం ఎస్‌బీఐ మేనేజర్ నరేంద్ర, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలను విడుదల చేయాలి


మాట్లాడుతున్న మెడికల్ కాంట్రాక్ట్ యూనియన్ నాయకుడు సుబ్బరాయుడు

ప్రొద్దుటూరు క్రైం : మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని మెడికల్ కాంట్రాక్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు కోరారు. స్థానిక జిల్లా ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కింద పని చేస్తున్న ఎఫ్ఎన్ఓలు, ఎంఎన్‌ఓలు, శానిటరీ సిబ్బందికి నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సంబంధిత కాంట్రాక్టర్ వీరికి వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని తెలిపారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శానిటేషన్ సిబ్బందికి సంబంధించిన పీఎఫ్ సొమ్మును అజిల్ కంపెనీ, చైతన్య జ్యోతి కంపెనీలు సరిగా చెల్లించలేదని చెప్పారు. క్యాజువల్ లీవ్‌లు కూడా అమలు చేయకుండా సూపర్‌వైజర్లు కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో మెడికల్ యూనియన్ ఉద్యోగ కార్మికులు లత, రాజమ్మ, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

చల్లంగ చూడు.. గాలివీటమ్మా..

- వైభవంగా ముగిసిన గంగమ్మజాతర
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన పోలీసులు


గాలివీడు : ప్రత్యేక అలంకరణలో గాలివీటమ్మ


చిట్వేలి: స్వామివారి గ్రామోత్సవ దృశ్యం

గాలివీడు : గాలివీటమ్మ.. చల్లంగ చూడమ్మా అంటూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కొంగు బంగారంగా కోరిన కోర్కెలు తీర్చే గాలివీటమ్మ జాతర మంగళవారం వైభవంగా ముగిసింది. మండల కేంద్రంలోని కుషావతి నదీ తీరాన వెలసిన శ్రీ గాలివీటి గంగమ్మ జాతర అత్యంత వైభవోపేతంగా జరిగింది. సోమవారం సద్దల కూడు నైవేద్యంతో ప్రారంభమైన జాతర విశేష పూజలతో ప్రత్యేక అలంకరణ నడుమ నిండు తిరునాలగా మారింది. మంగళవారం ఉదయం మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. పెద్దగొడుగు స్వామి తిరునాలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఘనంగా గ్రామోత్సవం

చిట్వేలి: మండల పరిధిలోని నక్కలపల్లిలో వెలసిన శ్రీశంకర భవానీ స్వామి గ్రామోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం నుంచి ప్రారంభమైన స్వామివారి తిరునాల సోమవారం రాత్రితో ఘనంగా ముగిసింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన నాగారపమ్మ జాతర

సుండుపల్లె: మండల కేంద్రంలోని పెదనేని కాలువ గ్రామ పంచాయతీ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మ తల్లి జాతర మహోత్సవం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. జాతరలో చాందినీ బండ్లు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.


సుండుపల్లె: ఆకట్టుకున్న ఛాందినీ బండ్లు


సుండుపల్లె: జాతరలో పాల్గొన్న భక్తులు

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక కన్వీనర్ నాగరాజు ఎంఈఓ శోభారాణికి వినతి పత్రం అందించారు. బుధవారం ఆమె కార్యాలయంలో కలిసి అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలోనే పుస్తకాలు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని ఎంఈఓకు వివరించారు. 25 శాతం పేద విద్యార్థులకు విద్యాసంస్థలు ఉచిత విద్యను అందించడం లేదని, విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులు కల్పించడం లేదని, ఆటస్థలాలు లేవని, సరైన పాఠశాల క్యాంపస్ లేవన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా నడుచుకుంటున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వేదిక సభ్యులు మహబూబ్ బాష, రసూల్‌బి తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా హిందీ స్టడీ మెటీరియల్స్


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సొసైటీ సభ్యులు

పుల్లంపేట: ప్రేమ్ చంద్ హిందీ భవన్ సొసైటీ, రాజంపేట వారి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి అభ్యసిస్తున్న విద్యార్థులకు సొసైటీ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్దాజ్ హుస్సేన్ ఉచితంగా హిందీ స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘురాం మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా హిందీ స్టడీ మెటీరియల్ అందజేయడం సంతోషకరమన్నారు. సొసైటీ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్దాజ్ హుస్సేన్ మాట్లాడుతూ ఇక్కడ హిందీ ఉపాధ్యాయుడు లేరని, స్టడీ మెటీరియల్ ఇస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని భావించి ఉచితంగా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామిరెడ్డి, గంగాధర్ , ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

సంధ్యా సమయం.. ప్రకృతి పరవశం

సంధ్యా సమయం వేళ.. ప్రకృతి పరవశించిపోయింది. పడమటి సంధ్యా రాగాన్ని ఆలపిస్తూ పులకించిపోయింది. నీలాకాశం మబ్బులు పట్టి.. సింధూర తిలకాన్ని సింగారించుకున్న మోమును చూసి చిరునవ్వులు చిందించింది. అందాలు ఆరబోసిన 'రవి' కిరణాల స్పర్శతో మైమరచిపోయింది. గాలివీడులో మంగళవారం సాయంత్రం ఆవిష్కృతమైన అందమైన దృశ్యమిది. – గాలివీడు



లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న లక్ష్మీనరసింహస్వామి


కోలాటం ఆడుతున్న మహిళలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధి నరసింహాపురం గ్రామంలోని పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున లక్ష్మీనరసింహాస్వామి, ఆంజనేయస్వామి మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. విశేషంగా నూతన పట్టు వస్త్రాలతో, వెండికవచాలు, రంగురంగుల పూలు, గజమాలలు, వడమాలతో అలంకరించారు. భక్తులు ప్రదక్షణలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తిగీతాలకు మహిళలు చేసిన కోలాటం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది.

గుండె జబ్బులను నిర్లక్ష్యం చేయవద్దు

ప్రొద్దుటూరు క్రైం : గుండె జబ్బులను నిర్లక్ష్యం చేయవద్దని కార్డియాలజిస్టు డాక్టర్ వెంకట చెంచయ్య తెలిపారు. స్థానిక ఎన్జీఓహోంలో మంగళవారం సాయంత్రం ధ్రితి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గుండె జబ్బులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ధ్రితి హాస్పిటల్స్ వైద్యుడు వెంకటచెంచయ్య గుండె జబ్బులపై వీడియో ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. గుండె జబ్బు అనేది వృద్ధాప్యంలో వచ్చే వ్యాధి కాదని డాక్టర్ తెలిపారు. చిన్న వయస్సులోనే గుండె జబ్బులు వస్తున్నాయని చెప్పారు. ఆడవారితో పోలిస్తే మగవారిలో ఈ జబ్బులు రావడానికి ఎక్కువగా అవకాశాలు ఉన్నాయన్నారు.